బలగం BALAGAM TV
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ గురువారం 07 ఆగస్టు 2025 | www.balagamtv.com | పేజీలు 4

## ప్రధాని చైనా పర్యటన ఖరారు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ త్వరలో చైనాలో పర్యటించనున్నారు. ఈ మేరకు షెడ్యూల్ ఖరారైంది. తియాంజిన్ వేదికగా ఆగస్టు 31, సెప్టెంబర్ 1 తేదీల్లో జరగనున్న షాంఘై సహకార సదస్సులో ఆయన పాల్గొననున్నారు. గల్వాన్ ఘటన తర్వాత ప్రధాని మోడీ చైనాలో పర్యటనకు వెళ్లడం ఇదే తొలిసారి. ఈ పర్యటనలో రష్యా అధ్యక్షుడు పుతిన్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌లతో మోడీ ప్రత్యేకంగా భేటీ అయ్యే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. గతేడాది కజాన్‌లో జరిగిన బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో జిన్‌పింగ్‌తో మోడీ భేటీ అయిన విషయం తెలిసిందే. తొలిసారిగా 2015లో బీజింగ్‌కు వెళ్లిన భారత ప్రధాని.. ఇప్పటివరకు ఐదుసార్లు ఆ దేశంలో పర్యటించారు. 2019లో చివరిసారిగా చైనాలో పర్యటించారు. ఆ తర్వాత 2020లో లద్దాక్ సరిహద్దుల్లో భారత్–చైనా సైనికుల మధ్య ఘర్షణతో ఇరుదేశాల మధ్య దౌత్య సంబంధాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. వీటి పునరుద్ధరించేందుకు సైనిక, దౌత్యాధికారుల మధ్య అనేక దఫాల్లో చర్చలు జరిగ్గా ఇటీవలే కొంత పురోగతి కనిపిస్తోంది. మరోవైపు భారత్‌పై సుంకాలు విధించిన ట్రంప్.. రష్యాతో ముడిచమురు కొనుగోలును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. రానున్న రోజుల్లో మరిన్ని విధిస్తామంటూ హెచ్చరిస్తున్నారు. ఇదే సమయంలో రష్యా మాత్రం భారత్‌కు మద్దతుగా నిలుస్తోంది. ఇదే సదస్సులో రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో మోడీ భేటీ అయ్యే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ప్రధాని మోడీ తాజా పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది.

# మోడీని గద్దె దించుతాం

- బిల్లులు ఆమోదం వరకూ నిద్రపోం..
- బీజేపీకి ఈసారి 150 సీట్లు కూడా రావు
- బీసీలకు విఘాతం కలిగిస్తున్న బీజేపీ
- సీఎం రేవంత్ రెడ్డి
- ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద దీక్ష



**బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో**

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల సాధన కోసం ఢిల్లీలో టీపీసీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన మహాధర్నాలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఘాటైన వ్యాఖ్యలు చేశారు. బీసీలకు న్యాయం జరిగే వరకు వెనక్కి తగ్గేది లేదని, అవసరమైతే ప్రధాని మోదీని గద్దె దించేందుకు కూడా సిద్ధమేనని హెచ్చరించారు. రాహుల్ గాంధీని ప్రధానమంత్రిగా చేసి, బీసీలకు పూర్తి న్యాయం చేస్తామని స్పష్టం చేశారు. "తెలంగాణ ప్రజల శక్తిని తక్కువ అంచనా వేస్తే మోదీకి తడాఖా చూపిస్తాం. బిల్లు ఆమోదం వరకు నిద్రపోం.." అన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ చేసిన బిల్లులను ఆమోదించాలన్న అంశంపై ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద నిర్వహించిన పోరుబాట ధర్నా కార్యక్రమంలో ముఖ్యమంత్రి గారు పాల్గొని ప్రసంగించారు. ఈ ధర్నాలో పార్లమెంట్ లో ప్రతిపక్ష ఇండియా కూటమికి చెందిన పలువురు పార్లమెంట్ సభ్యులు పాల్గొని ఓబీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న తెలంగాణ సంకల్పానికి మద్దతును ప్రకటించారు.

గతంలో గోద్రా అల్లర్ల సమయంలో వాజ్‌పేయి సూచించినా మోదీ రాజీనామా చేయలేదని, 75 ఏళ్లు నిండినందున ఇప్పుడైనా తప్పుకోవాలని ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ కోరుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. "ఈసారి బీజేపీకి 150 సీట్లు కూడా దక్కవు" అని తేల్చి చెప్పారు. బీసీ రిజర్వేషన్ల బిల్లులు ఆమోదించకపోతే "ఇక ఢిల్లీ రాము.. గల్లీలో బీజేపీ నేతలను పట్టుకుంటాం" అని హెచ్చరించారు. గతంలో కేసీఆర్ చేసిన చట్టమే రిజర్వేషన్ల పెంపునకు గుదిబండగా మారిందని మండిపడ్డారు. 50 శాతం పరిమితిని అధిగమించకూడదన్న చట్టాన్ని రద్దు చేసి కొత్త ఆర్డినెన్స్ పంపినా గవర్నర్ ఆమోదించకపోవడం వెనుక బీజేపీ చేతులుంటాయని ఆరోపించారు. కిషన్‌రెడ్డి, బండి సంజయ్, రాంచందర్‌రావులు బీసీ రిజర్వేషన్లకు అడ్డుపడుతున్నారని ఫైర్ అయ్యారు.

దేశంలో ఇప్పటివరకు ఎవరు చేయని కులగణన చేపట్టిన అదృష్టం తనకు దక్కిందని సీఎం అన్నారు. "వందేళ్లలో ఎవరూ చేయని పని చేశా.. బీసీలకు 42% రిజర్వేషన్ల సాధన కోసం ఢిల్లీలో మేమొచ్చాం.. కేంద్రం మెడలు వంచినా సాధించేస్తాం" బీసీ రిజర్వేషన్ల ధర్నాను కేటీఆర్ 'డ్రామా' అన్న వ్యాఖ్యలపై తీవ్రంగా స్పందించారు."ఆ కుటుంబం డ్రామాలతోనే బతుకుతోంది. కేటీఆర్ బుద్ధి మారలేదు, అహంకారం తగ్గలేదు. ఒకరు అనుకూలంగా, మరొకరు ప్రతికూలంగా మాట్లాడుతున్నారు" అన్నారు.

స్థానిక సంస్థలు, విద్య, ఉద్యోగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు సంబంధించి శాసనసభ ఆమోదించిన రెండు బిల్లులకు వెంటనే ఆమోదం తెలపాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. అలాగే, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు 50 శాతం దాటొద్దని పరిమితి విధిస్తూ చేసిన చట్టాన్ని సవరిస్తూ జారీ చేసిన ఆర్డినెన్స్ కు కూడా ఆమోదముద్ర వేయాలని విజ్ఞప్తి చేశారు.

ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన ఈ పోరుబాట కార్యక్రమంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, 4 కోట్ల తెలంగాణ ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా శాసనసభలో విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు ఆమోదముద్ర వేయాలని డిమాండ్ చేశారు. "రాబోవు రోజుల్లో దేశవ్యాప్తంగా చేపట్టే జనగణనలో కులగణన తెలంగాణ నమూనా దేశానికి ఆదర్శంగా, రోల్ మాడల్ గా నిలుస్తుంది. ఫిబ్రవరి 4, 2024 రోజున ప్రారంభించి సరిగ్గా ఏడాది కాలంలో 4 ఫిబ్రవరి 2025 నాటికి సర్వే పూర్తి చేసి రిజర్వేషన్లు కల్పిస్తూ పరిష్కార మార్గం చూపించాం. ఆ రిజర్వేషన్లను సాధించుకోవడానికే సడక్ నుంచి సంసద్ వరకు వచ్చాం. యావత్ దేశం ఇప్పుడు తెలంగాణ వైపు చూస్తోంది. వందేళ్లలో ఇలాంటి ప్రక్రియ చేపట్టలేదు. రాష్ట్రాలను పాలించిన దాదాపు మూడు వందల మంది ముఖ్యమంత్రులు ఎవరూ చేయలేని సాహసం తెలంగాణ మంత్రిమండలి విజయవంతంగా పూర్తి చేసింది.

తెలంగాణ శాసనసభ చేసిన బిల్లులు, రిజర్వేషన్లపై 50 శాతం పరిమితిని తొలగిస్తూ జారీ చేసిన ఆర్డినెన్స్ గవర్నర్ ద్వారా రాష్ట్రపతి గారికి చేరి నాలుగు నెలలైనా ఆమోదముద్ర పడలేదు. ఆ నేపథ్యంలోనే చలో ఢిల్లీ కార్యక్రమం చేపట్టాం. తెలంగాణ ప్రభుత్వం సంకల్పించిన బీసీ రిజర్వేషన్లకు వివిధ రాష్ట్రాలకు చెందిన ఎంతో మంది పార్లమెంట్ సభ్యులు మద్దతుగా నిలబడ్డారు. జంతర్ మంతర్ ధర్నాతో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు దక్కుతాయని నాకు సంపూర్ణ విశ్వాసం ఉంది. మా డిమాండ్ ను ఆమోదించాలి. రిజర్వేషన్లు సాధించే వరకు నిద్రపోం. ఈ రిజర్వేషన్ల కోసం ఢిల్లీలో నినదించిన విషయాలను తెలంగాణ గ్రామ గ్రామాన చేరవేయాలి. ఒక గొప్ప లక్ష్యంతో ఢిల్లీ వేదికగా పోరాటం సాగిస్తున్నాం. రాష్ట్రపతి గారు మా బిల్లులను వెంటనే ఆమోదించండి.." అని విజ్ఞప్తి చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో డీఎంకే, సమాజ్ వాది, ఎన్సీపీ, శివసేన, సీపీఎం తదితర పార్టీలకు చెందిన పార్లమెంట్ సభ్యులు పాల్గొని తెలంగాణ సంకల్పించిన 42 శాతం బీసీ రిజర్వేషన్లకు మద్దతును ప్రకటించారు. ధర్నాలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క గారితో పాటు మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి గారు, దామోదర రాజనర్సింహ గారు, దుద్దిళ్ల శ్రీధర్ బాబు గారు, తుమ్మల నాగేశ్వరరావు గారు, జూపల్లి కృష్ణారావు గారు, కొండా సురేఖ గారు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి గారు, పొన్నం ప్రభాకర్ గారు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి గారు, వివేక్ వెంకటస్వామి గారు, అడ్లూరి లక్ష్మణ్ గారు, వాకిటి శ్రీహరి గారు, సలహాదారులు, పార్లమెంట్ సభ్యులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధులు, బీసీ సంఘాల ప్రతినిధులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# మరో 25 శాతం బాదుడు

- భారత్‌పై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అదనపు సుంకాలు
- ఈ నెల 27 నుంచి అమల్లోకి
- 50 శాతానికి చేరిన టారిఫ్‌లు
- రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలుకు ప్రతీకారం



**బలగం టీవీ, వాషింగ్టన్**

భారత్‌పై మరోసారి దిగుమతుల సుంకాలుగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వేటు వేశారు. రష్యా నుంచి చమురు దిగుమతి చేస్తున్నందుకు గాను ఇప్పటికే ఉన్న 25 శాతం సుంకానికి తోడు మరో 25 శాతం అదనంగా విధిస్తూ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ జారీ చేశారు. దీంతో భారత్‌పై మొత్తం 50 శాతం టారిఫ్ అమలులోకి రానుంది. కొత్తగా విధించిన ఈ అదనపు సుంకం ఆగస్టు 27వ తేదీ నుంచి అమలులోకి రానుంది.

భారత్ అమెరికన్ వస్తువులపై సుంకాలు విధించినందుకు ప్రతీకార చర్యగా ట్రంప్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించారు. ఇప్పటికే ఆగస్టు 1 నుంచి 25 శాతం సుంకాలు అమలులోకి వచ్చాయని గుర్తుచేశారు. అయినా భారత్ రష్యా చమురును దిగుమతి చేసుకుంటోందని ఆరోపించారు. ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌లో రష్యా చమురు నిషేధం నేపథ్యంలో భారత్ చర్యలు అమెరికా విధానాలకు విరుద్ధమని పేర్కొన్నారు. ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ 14066 ప్రకారం, జాతీయ ఎమర్జెన్సీకి ప్రతికూలంగా భారత్ వ్యవహరిస్తోందని ట్రంప్ అభిప్రాయపడ్డారు. మరిన్ని దేశాలు ప్రతీకార చర్యలకు పాల్పడితే తాను మరింత కఠినంగా వ్యవహరించనున్నట్లు హెచ్చరించారు.

అమెరికా రష్యా నుంచి యురేనియం, ఎరువులు దిగుమతి చేస్తున్న విషయాన్ని తానికేమీ తెలియదని ట్రంప్ వ్యాఖ్యానించారు. భారత్ ప్రశ్నలపై విలేకరులు ఎదురుగా నిలబడ్డా.. "అదేమీ నాకు తెలియదు" అన్నారు. ఈ చర్యలపై భారత విదేశాంగ శాఖ తీవ్రంగా స్పందించింది. "అదనపు సుంకాలు అన్యాయం, అసమంజసం, అహేతుకం. 140 కోట్ల ప్రజల ఇంధన భద్రత కోసం మేము వ్యూహాత్మకంగా దిగుమతులు చేసుకుంటున్నాం. మమ్మల్ని లక్ష్యంగా చేసుకోవడం దురదృష్టకరం" అని స్పష్టం చేసింది.

**భారత్‌పై అధిక టారిఫ్‌లు:**

భారత్, బ్రెజిల్: 50%
స్విట్జర్లాండ్: 39%
కెనడా, ఇరాక్: 35%
చైనా: 30%

**తాజా సుంకాల అమలుదినాలు**

ఆగస్టు 1: భారత్, బ్రెజిల్‌పై తొలి విడత సుంకాలు
ఆగస్టు 7: మెక్సికోతో పాటు మరో 69 దేశాలపై కొత్త రేట్లు
ఆగస్టు 27: భారత్‌పై మరో 25% అదనపు టారిఫ్ అమలు

## అన్యాయం.. అసమంజసం.. అహేతుకం

- భారత విదేశాంగ శాఖ

**బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో**

రష్యా నుంచి చమురు దిగుమతులు చేస్తున్నదన్న కారణంతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై అదనంగా మరో 25 శాతం సుంకాలు విధించడాన్ని భారత ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. అమెరికా చర్యను లిలి"అన్యాయం, అసమంజసం, అహేతుకం"లిలిగా విదేశాంగ శాఖ పేర్కొంది భారత విదేశాంగ శాఖ బుధవారం ఓ ప్రకటనలో స్పందిస్తూ, "జాతీయ ప్రయోజనాలను కాపాడేందుకు అవసరమైన అన్ని చర్యలు మేం తీసుకుంటాం. మా ఇంధన విధానం పూర్తిగా మార్కెట్ ఆధారితమే. 140 కోట్ల ప్రజల ఇంధన భద్రత మా ప్రాథమిక బాధ్యత. ఇప్పటి వరకు ఈ వ్యవహారంపై మేము స్పష్టమైన ప్రకటనలే చేశాం. అయినా అమెరికా ఇలా చర్యలకు దిగడం బాధాకరం" అని పేర్కొంది.

# ఢిల్లీ డ్రామా అట్టర్ ఫ్లాప్

- మాజీ మంత్రి హరీశ్‌రావు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**



42 శాతం బీసీ రిజర్వేషన్ల పేరిట ఢిల్లీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేపట్టిన ధర్నాను మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు తీవ్రంగా విమర్శించారు. ఇది పూర్తిగా "ఢిల్లీ డ్రామా అట్టర్ ఫ్లాప్" అయ్యిందని ఆయన వ్యాఖ్యానించారు.బీసీల హక్కుల కోసం ఢిల్లీలో ఆందోళన చేస్తూ పార్టీ నేతలంతా పిలుపునిచ్చిన నేపథ్యంలో, కాంగ్రెస్ అధినేత రాహుల్‌గాంధీ, పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ధర్నాకు దూరంగా ఉండడాన్ని హరీశ్‌రావు ఎత్తిచూపారు.

"రాహుల్‌గాంధీకి బీసీ కన్నా బీహార్ ముఖ్యమైంది, ఖర్గేకు ఈ పోరాటం ముఖ్యం కాదు. ధర్నాలో నిజాయితీ లేదు. రిజర్వేషన్ల అమలుపై రాహుల్‌కూ, తెలంగాణ ప్రజలకూ నమ్మకం లేదన్న విషయం దీనితో తేటతెల్లమైంది," అని అన్నారు.

ఒకే అంశంపై రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి భిన్నంగా మాట్లాడారని విమర్శించారు. "మేం గుజరాత్, యూపీ, మహారాష్ట్రలో అడగలేదు – తెలంగాణకే 42 శాతం రిజర్వేషన్లు కావాలి" అని రేవంత్ ప్రసంగిస్తే, అదే సమయంలో రాహుల్ "ఈ పోరాటం దేశం కోసం చేస్తున్నాం" అని ట్వీట్ చేయడాన్ని హరీశ్‌రావు ప్రశ్నించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌పై కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి లేదని, రెండు నాలల ధోరణి కాంగ్రెస్‌లో స్పష్టంగా కనిపిస్తోందని మండిపడ్డారు. ఇది రాజకీయ నాటకం తప్ప, బీసీలకు న్యాయం చేసే చొరవ కాదని స్పష్టం చేశారు.

## లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన జగిత్యాల జిల్లా రవాణా అధికారి..

**బలగం టీవీ, జగిత్యాల**



జగిత్యాల జిల్లా రవాణా అధికారి (డీటీవో) కార్యాలయంపై ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో, డీటీవో భద్రు నాయక్ రూ. 22 వేలు లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. శశిధర్ అనే వ్యక్తి నుంచి జేసీబీని విడిపించేందుకు భద్రు నాయక్ ఈ లంచం డిమాండ్ చేసినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. ఈ నెల 31న ఆయన పదవీ విరమణ చేయాల్సి ఉంది. ఈ ఘటనపై ఏసీబీ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించింది.

# ఆరోగ్యశ్రీ పేరుతో భారీ మోసాలు

- సైబర్ నేరగాడి అరెస్ట్..
- ఆరోగ్య శాఖ నుండి మాట్లాడుతున్నాం అంటూ బాధితులకు నిందుతుడు ఫోన్ కాల్స్..
- హాస్పిటల్ ఖర్చుల రీఫండ్ అంటూ నిందుతుడు మోసాలు..
- నిందుతుణ్ణి హైదరాబాద్ లో పట్టుకున్న జిల్లా సైబర్ టీమ్
- సిరిసిల్ల డిఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

ఆరోగ్య శాఖ నుండి మాట్లాడుతున్నామంటూ బాధితులకు ఫోన్ చేసి, ఆసుపత్రి ఖర్చుల రీఫండ్ పేరుతో మోసాలకు పాల్పడుతున్న వ్యక్తిని సిరిసిల్ల జిల్లా సైబర్ టీమ్ హైదరాబాద్‌లో అరెస్ట్ చేసింది. కడప జిల్లా జమ్మలమడుగుకు చెందిన ముల్లుంటి సలీం మాలిక్ (32) అనే వ్యక్తి రెండు తెలుగు రాష్ట్రాల్లో సుమారు రూ. 60 లక్షల వరకు మోసాలకు పాల్పడినట్లు డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి వెల్లడించారు.నిందితుడు సలీం మాలిక్ బాధితులకు ఫోన్ చేసి, ఆరోగ్యశ్రీ కింద ఆసుపత్రి ఖర్చులు తిరిగి చెల్లిస్తామని నమ్మబలికేవాడు. ఆ తర్వాత ఒక లింక్‌ను పంపి, ఆ లింక్‌లో యూపీఐ పిన్ ఎంటర్ చేస్తే డబ్బులు వారి అకౌంట్‌లో జమ అవుతాయని చెప్పేవాడు. బాధితులు ఆ లింక్‌ను ఓపెన్ చేసి పిన్ ఎంటర్ చేయగానే వారి ఖాతా నుండి డబ్బులు కోల్పోవడం జరిగింది.

రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలానికి చెందిన రాజిరెడ్డి నిందితుడి మోసానికి గురయ్యారు. రాజిరెడ్డి 46 వేల రూపాయలు,10000 రూపాయలు నష్టపోవడం జరుగగా, రాజిరెడ్డి ఫిర్యాదు మేరకు ముస్తాబాద్ ఎస్.ఐ గణేష్ కేసు నమోదు చేశారు.

ఎస్పీ మహేష్ బి. గితే ఆదేశాల మేరకు సిరిసిల్ల రూరల్ సీఐ మొగిలి, ముస్తాబాద్ ఎస్.ఐ గణేష్, జిల్లా సైబర్ టీమ్ ఆర్.ఎస్.ఐ జునైద్, సిబ్బంది కిట్టు, గంగారెడ్డి, కానిస్టేబుల్ కాసిం బృందంగా ఏర్పడి సాంకేతిక ఆధారాల సహాయంతో నిందితుడిని హైదరాబాద్‌లో పట్టుకున్నారు.

సలీం మాలిక్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని ఎన్‌సీఆర్‌పీ పోర్టల్‌లో నమోదైన 79 పిటిషన్లలో సుమారు రూ. 60 లక్షల వరకు మోసాలకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. నిందితుడిని ఈరోజు రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు.

# ఫిలిప్పీన్‌కు తెలంగాణా బియ్యం

- తెలంగాణా సోనా (ఆర్.ఎన్.ఆర్15048) పై ఫిలిప్పీన్ ఆసక్తి
- ఆ దేశంతో తెలంగాణా వాణిజ్య సంబంధాలు పెంపునకు కృషి
- తెలంగాణా మొక్కజొన్నలపై ఫిలిప్పియన్ ఆసక్తి
- ఢిల్లీలో ఫిలిప్పీన్ వ్యవసాయ శాఖామంత్రి ఫ్రాన్సిస్కో పి.టి లారెల్ జూనియర్ తో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి భేటి



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ఈ సంవత్సరం తెలంగాణా రాష్ట్రం నుండి ఫిలిప్పీన్ దేశగానికి 2 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఎగుమతి చేయనున్నట్లు రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. తెలంగాణ సోనా(ఆర్.ఎన్.ఆర్ 15048) పట్ల ఫిలిప్పీన్స్ ఆసక్తితో ఉన్నారని ఆయన వివరించారు.

ఈ నేపధ్యంలో ఆ దేశంతోటి వాణిజ్య సంబంధాలు బలోపేతం అయ్యేలా చర్చలు జరుపుతున్నామని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికే బియ్యం ఎగుమతి తో తెలంగాణా రాష్ట్రం వాణిజ్య ఒప్పందం కుదుర్చుకున్న విషయాన్ని ఆయన గుర్తుచేశారు. బుధవారం ఉదయం దేశ రాజధాని ఢిల్లీలో ఫిలిప్పీన్ వ్యవసాయ శాఖామంత్రి ఫ్రాన్సిస్కో పి.టి లారెల్ జూనియర్ తో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పౌర సరఫరాల కార్యదర్శి డి.ఎస్ చౌహన్ తో కలసి భేటి అయ్యారు.

ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డివిమాట్లాడుతూ తెలంగాణా బియ్యానికి ఫిలిప్పీన్ లో డిమాండ్ ఉందని ఆ దేశానికి సరిపడా 2.00 మిలియన్ మెట్రిక్ టన్నుల బియ్యం అవసరం ఉంటుందని ఈ భేటీలో ఫిలిప్పీన్ మంత్రి పేర్కొన్నారన్నారు. తెలంగాణా నుండి బియ్యంతో పాటు ధాన్యం,మొక్కజొన్నల ఎగుమతి చేస్తూ వాణిజ్య సంబందాలు బలోపేతం చేసే దిశగా మా భేటి జరిగిందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. తెలంగాణా కు చెందిన సోనా(ఆర్.ఎన్.ఆర్ 15048) ఎగుమతి చేసే ప్రతిపాదనకు ఫిలిప్పీన్ మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు. సానుకూల సహృద్భావ మధ్య జరిగిన భేటి తెలంగాణా–ఫిలిప్పీన్ ల మధ్య మరింత మైత్రిని పెంపొందింప చేసిందన్నారు.తెలంగాణ ను సందర్శించాలన్న తమ అహ్వానానికి ఆయన సానుకూలంగా స్పందించారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.

## కాళేశ్వరం విషయంలో కుట్ర

- సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**



బనకచర్ల కోసమే కాళేశ్వరం ప్రాజెక్టును పండబెట్టారని, ఇది ముమ్మాటికి టీడీపీ అధినేత చంద్రబాబు కుట్రేనని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి ఆరోపించారు. బుధవారం ఆత్మకూర్ (ఎస్) మండలంలో రేషన్ కార్డులు, ఇండ్ల నిర్మాణాలకు సంబంధించి ప్రొసీడింగ్స్‌ను పంపిణీ చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై వస్తున్న విమర్శలన్నీ కాంగ్రెస్, బీజేపీ, టీడీపీ కలిసి నడిపిస్తున్న రాజకీయ నాటకమేనని విమర్శించారు. "ఇది కాంగ్రెస్ రిపోర్టు కాదు, చంద్రబాబు ప్రేరేపించిన బీజేపీ%–%కాంగ్రెస్ కలయిక రిపోర్టే," అని స్పష్టంగా చెప్పారు. గత రెండేళ్లుగా కేసీఆర్‌పై ఏడుపే తప్ప, ఒక్క ఆధారమైన ఆరోపణను కూడా చెల్లించలేకపోతున్నారని ఎద్దేవా చేశారు.

తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి పథంలో అడుగులు వేస్తున్నందుకు సీఎం కేసీఆర్‌ను విమర్శించేందుకు బీజేపీ, కాంగ్రెస్ ఆతృతపడుతున్నాయని చెప్పారు. "కేసీఆర్ పాలన ఫలితంగా తెలంగాణలో జీవధారగా మారిన కాళేశ్వరం ప్రాజెక్టుపై తప్పుడు ప్రచారం చేయడం దుర్మార్గం," అని అన్నారు. "నిన్ననే హరీశ్ రావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో అన్ని వాస్తవాలు వెల్లడించారు. అయినా కాంగ్రెస్ మాత్రం విష ప్రచారమే చేస్తోంది. ఇది స్థానిక సంస్థల ఎన్నికల స్టంట్ మాత్రమే" అని ధ్వజమెత్తారు.బీసీలకు అధికారాన్ని ఇవ్వాలని నిజమైన ఉద్దేశం ఉంటే.. చట్టపరమైన, న్యాయపరమైన చర్యలు తీసుకోవాలి గానీ, జంతర్‌మంతర్‌లో డ్రామాలు ఆడే అవసరం లేదన్నారు. సీఎం రేవంత్ మోదీ, చంద్రబాబు చేతుల్లో కీలుబొమ్మగా మారిపోయారని, ఢిల్లీ నాటకాలు బీసీలను మోసం చేయడానికే నిర్వహిస్తున్నారని ఆరోపించారు.

తెలంగాణకు చెందాల్సిన నీటిని బనకచర్ల రూపంలో ఆంధ్రాకు దారి మళ్లించే కుట్రను కాంగ్రెస్ కొనసాగిస్తోందని, రాష్ట్ర ప్రజలను అన్ని విధాలుగా మోసం చేసిందని మండిపడ్డారు. కేసీఆర్ పాలనలో ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యతనిచ్చారని, ఆయనకు మించిన నాయకుడు లేడని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీ వైస్‌చైర్మన్ గోపగాని వెంకట నారాయణ గౌడ్, మండల అధ్యక్షులు తూడి నరసింహారావు, గ్రంథాలయ మాజీ జిల్లా చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్, కోఆపరేటివ్ బ్యాంక్ ఛైర్మన్ కొనతం సత్యనారాయణ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గాంధీ కుటుంబాన్ని పొగడటానికే కాంగ్రెస్ సభ

- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ కాంగ్రెస్ నేతలు ఢిల్లీలో జంతర్‌మంతర్‌లో చేస్తున్న బీసీ ధర్నాపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. బుధవారం హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ,'గాంధీ కుటుంబాన్ని పొగడటానికి మాత్రమే కాంగ్రెస్ పార్టీ సభ పెట్టుకుంది. తెలంగాణలో ఎదురవుతున్న రాజకీయ ఒత్తిడిని తట్టుకునేందుకు గాంధీ కుటుంబ ఆశీర్వాదం పొందాలన్న లక్ష్యంతో సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీకి వెళ్లారు' అని ఎద్దేవా చేశారు. 31 నిమిషాల ప్రసంగంలో 50 శాతం కంటే ఎక్కువ భాగాన్ని రాహుల్, సోనియా గాంధీ పేర్లు జపించడానికే సీఎం ఉపయోగించారని విమర్శించారు. బీసీ రిజర్వేషన్లపై హామీ ఇచ్చింది కాంగ్రెస్ పార్టీనేకాబట్టి, దాన్ని అమలు చేయాల్సిన బాధ్యత కూడా ఆ పార్టీదే అని స్పష్టం చేశారు. చిత్తశుద్ధితో న్యాయపరమైన, చట్టపరమైన అంశాలపై దృష్టిసారించాలని హితవు పలికారు.

రాహుల్ గాంధీ చేసిన కామారెడ్డి డిక్లరేషన్ అమలు గురించి ప్రశ్నించారు. "18 నెలలు గడుస్తున్నా.. సీఎం రేవంత్ రెడ్డి ఆ డిక్లరేషన్‌లో పేర్కొన్న అంశాలపై అమలు కనిపించడంలేదు" అని విమర్శించారు.

**మోదీపై విమర్శలు దేనికి?**

రేవంత్ రెడ్డి ప్రధానమంత్రి మోదీపై విమర్శలు చేయడం అనవసరమని అన్నారు. "ఆకాశంపై ఉమ్మినట్లే అలాంటి విమర్శలు" అని వ్యాఖ్యానించారు. వివిధ బీసీ వర్గాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేయాలి అన్న హామీలు ఇచ్చినా, అమలు దిశగా ఒక్క అడుగూ వేయలేదన్నారు. "రజకులు, గౌడ్లు సహా ప్రతి బీసీ వర్గాన్ని కాంగ్రెస్ మోసం చేసింది. స్థానిక సంస్థల ఎన్నికలు జరిగితే కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకత బహిర్గతమవుతుంది. అందుకే ఆ ఎన్నికల్ని వాయిదా వేస్తోంది" అని ఆరోపించారు.

"తెలంగాణలో ధర్నా చేస్తే ఎవరూ పట్టించుకోరని భావించి ఢిల్లీకి వెళ్లి డ్రామాలు ఆడుతున్నారు. బీసీలకు సాధికారత కల్పించే విషయంలో సీఎం రేవంత్‌కు చిత్తశుద్ధి లేదు" అని కిషన్ రెడ్డి మండిపడ్డారు. బీజేపీ అభిప్రాయాన్ని స్పష్టంగా వెల్లడిస్తూ.. "అధికారికంగా 10 శాతం ముస్లింలను బీసీలలో చేర్చి 42 శాతం రిజర్వేషన్ అమలు చేస్తే బీసీలకు రాజ్యాధికారం అసాధ్యమవుతుంది. ముస్లింలతో కూడిన బీసీ రిజర్వేషన్లను బీజేపీ ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించదు" అని తెలిపారు. మోదీ నేతృత్వంలోని పాలన దేశానికి సుస్థిరత తీసుకువస్తోందని, బీజేపీదే బలమైన ప్రత్యామ్నాయమని కిషన్ రెడ్డి పేర్కొన్నారు.




## 'సత్యా' నిదే గెలుపు...

### ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ ఇన్చార్జి కన్వీనర్ దిడ్డి సుధాకర్.

**బలగం టివి, హైదరాబాద్**

ఢిల్లీ మాజీ హెల్త్ మినిస్టర్ ఆఫ్ నేత సత్యేంద్ర జెన్ పై మోపిన అక్రమ కేసులు కొట్టివేత సందర్భంగా, సీబీఐ దుర్వినియోగానికి నిరసనగా ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కమిటీ లిబర్టీ సర్కిల్ అంబేద్కర్ స్టాట్యూ వద్ద మౌన ప్రదర్శన నిర్వహించింది. మౌన ప్రదర్శన అనంతరం తెలంగాణ కన్వీనర్ దిడ్డి సుధాకర్, మాట్లాడుతూ "నిజాయితీ ఎప్పటికీ గెలుస్తుంది... బిజెపి ఎన్ని కుట్రలు చేసినా .. ఎన్ని కుతంత్రాలు పన్నినా.. బిజెపికి ప్రత్యామ్నాయంగా మారిన ఆమ్ ఆద్మీ పార్టీ నేతలపై సిబిఐ ద్వారా అవినీతి ఆరోపణలు చేసినా... సత్యం (ఆమ్ ఆద్మీ) గెలుపును ఎవరు ఆపలేరని" పేర్కొన్నారు.

సిబిఐ అధికారులపై సత్యేంద్ర జైన్ న్యాయపోరాటం చేశారు. సాక్ష్యాధారాలను సమర్పించడంలో సీబీఐ విఫలమైందనీ, ఎవరినైనా అర్టెస్ చేయాలంటే అనుమానం ఉంటే సరిపోదని తదుపరి చర్యలకు నేరానికి పాల్పడ్డారని అనడానికి బలమైన ఆధారాలు ఉండాల'ని కోర్టు తెలిపింది. దీంతో బీజేపీ అంటే "బురద జల్లే పార్టీ అని" స్పష్టమవుతుందని అన్నారు. మాజీ రాష్ట్ర అధ్యక్షులు బుర్ర రాము గౌడ్ మాట్లాడుతూ, "ఎన్నో నిందలు మా నాయకుల పైన మోపారు. అయినా ఎప్పుడు మేము చెక్కుచెదరలేదు, ఎప్పుడు బిజెపికి భయపడలేదు. వారి ప్రలోభాలకు లొంగలేదు. కాబట్టి ఈరోజు నిజాయితీగా బయటకి రాగలిగాము .అది మా నాయకుల దగ్గర ఉన్న నిజాయితీ. తప్పకుండా అరవింద్ కేజ్రీవాల్ పైన, సిసోడియా పైన అలాగే మా నాయకులు అందరి పైన పెట్టిన కేసులు త్వరలోనే ఈ కేసు లాగానే కొట్టి వేయబడతాయి" అని తెలిపారు.

రాష్ట్ర నాయకులు విజయ మల్లంగి మాట్లాడుతూ, " బిజెపికి పావుగా మారిన ఈడి–సీబీఐబీ రాజకీయ ప్రతీకార మరియు వేధింపులే అజెండాగా పెట్టుకుని పనిచేస్తున్నాయి. పదేళ్లుగా, బిజెపి గుప్పెట్లో ఉన్న దర్యాప్తు సంస్థలు ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులపై సుమారు 200 పైగా కేసులు దాఖలు చేసిబీ ఈడీ, సీబీఐ, ఢిల్లీ పోలీసులు, ఏసీబీల ద్వారా విస్తృత దర్యాప్తులు, దాడులు, ఫైళ్లను పరిశీలించినప్పటికీ, ఏ ఒక్క ఆప్ నాయకుడి పై మోపిన అభియోగాలను నిరూపించి, ఒక్క రూపాయి కూడా అవినీతిని స్వాధీనం చేయలేకపోయారు అని తెలిపారు. భవిష్యత్తులో బిజెపి కుట్రపన్ని , ఆమ్ ఆద్మీ పార్టీని అప్రతిష్టపాలు చేయాలని ఆప్ నాయకులపై ఎన్ని కేసులు ఫిరాయించిన, తాము క్లీన్ చీట్ తో నిజాయితీగా బయటికి వస్తామని ఆప్ కార్యకర్తలు ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కోర్ కమిటీ సభ్యులు మహమ్మద్ మజీద్, మాజీ మహిళా అధ్యక్షురాలు హేమాజిల్లోజు, మాజీ అధికార ప్రతినిధి జావేద్ షరీఫ్, ఎం శివాజీ, కొడంగల్ శ్రీనివాస్, రాకేష్ సింగ్ , వివేక్, మౌనిక, లియాఖతా?న్, జిశాన్ నెహ్రీ తదితరులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజన కార్మికుల బకాయిలు వెంటనే చెల్లించాలి

### సీపీఐ(ఎం)

**బలగం టివి, హైదరాబాద్**

మధ్యాహ్న భోజన కార్మికులు తమ సమస్యలను పరిష్కారం చేయాలని విద్యాశాఖ కమిషనర్ కార్యాలయానికి వస్తుంటే కార్మికులను ఎక్కడికక్కడ పోలీసులు అరెస్టుచేసి, పోలీస్ స్టేషన్లలో పెట్టారు. ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి రమను గృహ నిర్భంధం చేశారు. సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పాలడుగు భాస్కర్‌ను పోలీసు స్టేషన్‌లో నిర్భందించారు. అరెస్టుల సందర్భంగా అనేక మంది కార్మికులు గాయపడ్డారు. వారి సమస్యలు పరిష్కరించకుండా అరెస్టులకు పాల్పడటాన్ని తెలంగాణ సిపిఐ(ఎం) రాష్ట్రకమిటీ తీవ్రంగా ఖండిస్తున్నది అన్నారు.

'తమకు రావాల్సిన 10 నెలల వేతన బకాయిలు, ఆరునెలల గుడ్ల బకాయిలు వెంటనే చెల్లించాలని కార్మికులు అడుగుతున్నారు. అలాగే గ్యాస్ ఉచితంగా సరఫరా చేస్తామని హామీనిచ్చారు. రెండు సంవత్సరాలు కావస్తున్నా ఎందుకు యివ్వరు? కొత్తగా మెను అమలు చేస్తామని ప్రకటించినప్పటికీ, అవసరమైన నిధులు కేటాయించటం లేదు. మెనూలో వారానికి మూడు గుడ్లు, ప్రతిరోజు రాగిజావ, రెండు మూడు రకాల కూరగాయలు, సాంబరు వంటివి ఇస్తామన్నారు. అయినా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తూ నిధులు కేటాయించడం లేదు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంటనే జోక్యం చేసుకొని మధ్యాహ్న భోజనం కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, కొత్తగా అమలు చేస్తామన్న మెనూకు సరిపడా నిధులు కేటాయించాలని, వేతన బకాయిలు, గుడ్ల బకాయిలు వెంటనే చెల్లించాలి8' అని సిపిఐ(ఎం) డిమాండ్ చేస్తున్నదన్నారు. కార్మికులు తమ సమస్యలు పరిష్కారం కోసం పార్టీ పూర్తి మద్దతును తెలియజేస్తున్నదని అన్నారు.

## ఐర్లాండ్‌లో ఆరేళ్ల భారతీయ బాలికపై జాత్యాహంకార దాడి

**బలగం టివి,డబ్లిన్**

ఐర్లాండ్‌లోని వాటర్‌ఫోర్డ్ పట్టణంలో ఒక ఆరేళ్ల భారతీయ సంతతి బాలికపై జాత్యాహంకార దాడి జరిగింది. తన ఇంటి ముందు స్నేహితులతో కలిసి ఆడుకుంటున్న చిన్నారి పాపపై కొందరు బాలలు సైకిళ్లపై వచ్చి మానవత్వం మరిచిపోయేలా దాడి చేశారు. "ఇండియాకు వెళ్లు", "ఐర్లాండ్ నీ స్థలం కాదు" అంటూ దుర్భాషలతో తిట్టుతూ బాలికపై సైకిళ్లతో దాడికి దిగారు. ఈ ఘటన సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. బాధిత బాలిక తల్లి ఫిర్యాదు ప్రకారం, దాడి సమయంలో ఇంట్లో పదినెలల బిడ్డకు ఆహారం పెడుతుండగా, బయట నుంచి తన కూతురు వికారమైన అరుపులతో ఇంట్లోకి పరుగెత్తుతూ వచ్చింది. ముఖంపై గాయాలే కాక, జుట్టు పట్టి లాకడం, వెనుక నుంచి కింద భాగంలోకి సైకిల్ తోశారనే వివరాలు బాలిక తల్లి వెల్లడించారు. బాలిక మాట్లాడుతూ, తాను మామూలుగా ఆడుకుంటుండగానే అక్కడికి వచ్చిన బాలురు (వారిలో ఓ బాలిక కూడా ఉంది) దాడి చేశారనీ, ఏమాత్రం నిర్దోషంగా ఉన్న తనపై శారీరకంగా అతి దారుణంగా ప్రవర్తించారనీ తెలిపింది. ఘటన తరువాత బాలిక తీవ్ర భయాందోళనకు లోనైందని, రెండు రోజులుగా నొప్పులు, భయం వల్ల ఇంటి గుమ్మం దాటేందుకు కూడా భయపడుతుందనీ తల్లి వాపోయారు. ఐర్లాండ్‌లో భారతీయ సంతతి చిన్నారిపై జాత్యాహంకార దాడి కేసు నమోదవడం ఇదే తొలిసారి కావడం గమనార్హం.

## పౌష్టికాహారం అందిస్తూ... పాఠాలు బోధించాలి

### జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా రూ. 20 కోట్లతో 170 అంగన్వాడీ కేంద్రాలు నిర్మిస్తాం

**బలగం టివి, తంగళ్లపల్లి**



తంగళ్ళపల్లి మండలం చీర్లవంచలో నూతనంగా ఏర్పాటుచేసిన 2 అంగన్వాడి భవనాలను కేకే మహేందర్ రెడ్డి తో కలిసి కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ప్రారంభించారు. అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు పౌష్టికాహారం అందించాలని, ప్రీ ప్రైమరీ పాఠాలు బోధించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు.ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 585 అంగన్వాడీ కేంద్రాలు ప్రైవేట్ భవనాల్లో కొనసాగుతున్నాయని వివరించారు. డీఎంఎఫ్టీ నిధులు రూ. 20 కోట్లతో జిల్లాలోని ఆయా మండలాల్లో మొత్తం 170 అంగన్వాడీ కేంద్రాల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని తెలిపారు.

సిరిసిల్ల నియోజకవర్గం పరిధిలో మొత్తం 49 నిర్మాణానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. అన్ని భవనాలు రానున్న ఆరు నెలల్లో అందుబాటులోకి వస్తాయని కలెక్టర్ వెల్లడించారు. ఇందులో భాగంగా తంగళ్ళపల్లి మండలం చీర్లవంచలో నూతనంగా నిర్మించిన రెండు అంగన్వాడీ కేంద్రాల భవనాలను ప్రారంభించామన్నారు. ప్రీ ప్రైమరీ విద్య బలోపేతానికి అన్ని చర్యలు తీసుకుంటుందని తెలిపారు. నూతన భవనాలు నిర్మించి, మౌలిక వసతులు కల్పిస్తుందని పేర్కొన్నారు. పిల్లలు ఆడుతూ.. పాడుతూ విద్యను అభ్యసించే అవకాశం వస్తుందని వివరించారు. పక్కా భవనాలతో అంగన్వాడీ కేంద్రాల్లో అన్ని ఇబ్బందులు తొలగిపోతున్నాయని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, స్థానిక నాయకులు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ మహా సంపర్క్ అభియాన్ కార్యక్రమం



**బలగం టీవీ, ఇల్లంతకుంట**

ఇల్లంతకుంట మండల కేంద్రంలో "మహా సంపర్క్ అభియాన్" కార్యక్రమంలో భాగంగా "ఇంటింటికి బీజేపీ–గ్రామీణ వికాసం బిజెపి తోనే సాధ్యం " అనే నినాదంతో బీజేపీ నాయకులు బుధవారం ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు నాగసముద్రాల సంతోష్, నాయకులు మ్యాకల మల్లేశం, ఇట్టిరెడ్డి లక్ష్మారెడ్డి, బత్తిని సాయిగౌడ్, కర్ల లక్ష్మణ్, బూత్ అధ్యక్షులు కూనబోయిన బాలరాజు, కూనబోయిన కార్తీక్ లు పాల్గొని డోర్ స్టిక్కర్లు, కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ మండల అధ్యక్షుడు నాగసముద్రాల సంతోష్ మాట్లాడుతూ, ప్రజల్లో మోడీ పాలనపై అపారమైన విశ్వాసం ఉందనీ,దేశభక్తుడు ఐన మోడీ ప్రధాని కావడం దేశ ప్రజల అదృష్టమన్నారు .అందుకే బీజేపీ పార్టీకి అడుగడుగునా మద్దతు లభిస్తోంది" అన్నారు. అలాగే రానున్న స్థానిక ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను విజయవంతం చేయడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని, గతంలో టీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమయ్యాయని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీసీలను మోసం చేసి, ఇప్పుడు మరోసారి బీసీ రిజర్వేషన్ డ్రామాతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీకి నిజమైన చిత్తశుద్ధి ఉంటే స్థానిక ఎన్నికలను వెంటనే నిర్వహించాలి. బీసీలపై ప్రేమ ఉంటే వారికి ప్రత్యేకంగా 42% రిజర్వేషన్ ప్రకటించాలి" అని డిమాండ్ చేశారు.

## సృష్టి కేసులో సంచలన విషయాలు

- **డాక్టర్ నమ్రతను తిరిగి కస్టడిలోకి తీసుకోనున్న పోలీసులు**

**బలగం టివి, హైదరాబాద్**

రెండు తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేపిన సృష్టి ఫర్టిలిటీ సెంటర్ అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తుండటంతో ప్రధాన నిందితురాలు, ఆ కేంద్రం నిర్వాహకురాలు డాక్టర్ నమ్రత చుట్టూ ఉచ్చు బిగుస్తోంది. ఆమెను ఐదు రోజులపాటు కస్టడీకి తీసుకుని విచారించిన గోపాలపురం పోలీసులు సష్టిలో మోసాలపై పలు కీలక విషయాలు రాబట్టినట్టు తెలిసింది. మంగళవారం పోలీసు కస్టడీ ముగియడంతో ఆమెను మేజిస్ట్రేట్ ఎదుట హాజరపరిచి, తిరిగి చంచల్‌గూడ జైలుకు తరలించిన విషయం తెలిసిందే. అయితే నమ్రతాను విచారించినప్పటికీ కేసుకు సంబంధించిన పూర్తి స్థాయిలో వివరాలను పోలీసులు సేకరించలేకపోవడంతో తిరిగి మరోసారి కస్టలోకి తీసుకోవాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా బుధవారం నమ్రతను కస్టడీకి ఇవ్వాలని కోరుతూ పోలీసులు కోర్టులో పిటిషన్ వేశారు. ఇదిలావుండగా శంషాబాద్ విమానాశ్రయంలో అదుపులోకి తీసుకున్న బినామీ డాక్టర్ విద్యుల్లతను పోలీసులు విచారించి సష్టిలో మోసాలపై కీలక ఆధారాలు సేకరించినట్టు సమాచారం. 86 మంది దంపతులను సరోగసీకి ఒప్పించిన డాక్టర్ నమ్రత, ఒక్కో జంట నుంచి రూ.30 నుంచి రూ.50 లక్షల వరకు వసూలు చేసినట్టు పోలీసులు గుర్తించారు. దాదాపు 80మంది పిల్లలను నమ్రత విక్రయించినట్టు తెలిసింది. వేర్వేరు ప్రాంతాలు, రాష్ట్రాల్లో పిల్లలను కొనుగోలు చేసినట్టు పోలీసుల విచారణలో అంగీకరించినట్టు సమాచారం. పలువురు బాధితులు పోలీసులను ఆశ్రయిస్తుండగా ఇప్పటికే నాలుగు ఎఫ్ఐఆర్‌లు నమోదైనట్టు పోలీసులు తెలిపారు. బాధితుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. ఇక ఈ కేసులో తాజాగా 9 మందిని అరెస్టు చేసినట్టు తెలుస్తోంది.

ప్రముఖ గైనకాలజిస్ట్ లెటర్‌హెడ్‌లు వాడిన నమ్రత

సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ నిర్వాహకురాలు డాక్టర్ నమ్రత కేసులో సంచలన విషయాలు వెలుగు చూస్తున్నాయి. సికింద్రాబాద్‌కు చెందిన ప్రముఖ గైనకాలజిస్ట్, రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ కన్సల్టెంట్‌గా పనిచేసిన వైద్యురాలి లెటర్‌హెడ్‌లను వాడి నమ్రత పలువురికి ఇంజక్షన్లు, మందులు ఇచ్చినట్టు పోలీసులు గుర్తించారు. తన పేరుతో ఉన్న లెటర్ హెడ్ చూసి గైనకాలజిస్ట్ ఆశ్చర్యానికి గురయ్యారని తెలిసింది. నమ్రతపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఆమె ఫిర్యాదు చేశారు. విచారించిన పోలీసులు నమ్రతా సరోగసీ పేరుతో చైల్డ్ ట్రాఫికింగ్‌కు పాల్పడినట్టు గుర్తించారు.

## సంధ్య థియేటర్ ఘటనపై సీఎస్‌కు షోకాజ్ నోటీసులు

**బలగం టివి, హైదరాబాద్**

బ్లాక్‌బస్టర్ చిత్రం 'పుష్ప–2' విడుదల సందర్భంగా హైదరాబాద్‌లోని సంధ్య థియేటర్ వద్ద చోటు చేసుకున్న విషాదకర ఘటనపై జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సి) తీవ్రంగా స్పందించింది. సినిమా విడుదల రోజున అభిమానుల గుమిగూడింపు కారణంగా ఏర్పడిన తొక్కిసలాటలో ఓ మహిళ ప్రాణాలు కోల్పోయిన ఘటనపై తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి కమిషన్ షోకాజ్ నోటీసులు జారీ చేసింది. అకస్మాత్తుగా ఏర్పడిన ఈ తొక్కిసలాటలో మరణించిన మహిళ కుటుంబానికి రూ.5 లక్షల పరిహారం చెల్లించేందుకు ఆదేశాలివ్వకపోవడాన్ని ఎన్‌హెచ్‌ఆర్‌సి ప్రశ్నించింది. ఈ ఘటనపై పోలీసులు సమర్పించిన నివేదికపై అసంతృప్తి వ్యక్తం చేసిన కమిషన్, షోకు అనుమతి లేదన్న సమాచారం ఉన్నా.. అల్లు అర్జున్ ఎందుకు హాజరయ్యారు? అభిమానుల రద్దీకి ముందస్తు చర్యలు ఎందుకు తీసుకోలేదన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయని పేర్కొంది. పూర్తిస్థాయిలో నిష్పక్షపాత దర్యాప్తు జరిపి, ఆరు వారాల్లో కమిషన్‌కు సమగ్ర నివేదికను సమర్పించాలని, అలాగే బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని హైదరాబాద్ సీపీకి ఎన్‌హెచ్‌ఆర్‌సి స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

# అర్హులందరికీ రేషన్ కార్డులు అందజేస్తాం

- జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా
- రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ : కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్ రెడ్డి



**బలగం టివి, తంగళ్లపల్లి**

అర్హులైన పేదలందరికీ నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిరంతర ప్రక్రియ అని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లి లోని ఎస్ ఎస్ గార్డెన్స్ లో నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించగా, ముఖ్య అతిథిగా కలెక్టర్, కేకే మహేందర్ రెడ్డి హాజరయ్యారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తంగళ్లపల్లి మండలంలోని అర్హులైన లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులు జారీ చేస్తున్నామని వెల్లడించారు. వీటి ద్వారా పేదలకు రేషన్ అందుతుందన్నారు. మండలంలో నూతనంగా 1397 కొత్త కార్డులు, ఇప్పటికే ఉన్న కార్డుల్లో 2224 మంది కుటుంబ సభ్యుల పేర్లను నమోదు చేసి అందిస్తున్నామని వెల్లడించారు.ప్రజల జీవనంలో రేషన్ కార్డు చాలా కీలకమైన డాక్యుమెంట్ , ఆధార్ కార్డు, కరెంట్ కనెక్షన్ , ప్రభుత్వ పథకాల అమలు వంటి అనేక కార్యక్రమాలకు రేషన్ కార్డు ఉపయోగపడుతుందని కలెక్టర్ తెలిపారు.ప్రతి లబ్ధిదారుడికి నెలకు 6 కిలోల సన్న బియ్యం రేషన్ దుకాణాల ద్వారా పంపిణీ చేయడం జరుగుతుందని వివరించారు. నూతన రేషన్ కార్డు ద్వారా ఇందిరమ్మ ఇండ్లు, ఫించన్ వంటి అనేక సంక్షేమ పథకాలకు అర్హత వస్తుందని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా స్పష్టం చేశారు. రేషన్ కార్డులను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం

కే కే మహేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఒక్కొకటి అమలు చేస్తూ ముందుకు వెళ్తుందని తెలిపారు. అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా పథకాలు అమలు చేస్తుందని వివరించారు. ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డుల పంపిణీ, కుటుంబ సభ్యుల పేర్ల నమోదు, రైతు భరోసా, రైతు బీమా, రైతు రుణ మాఫీ, 500 లకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్ ప్రయాణం, ఇందిరా మహిళా శక్తి కింద క్యాంటీన్లు, మిల్క్ పార్లర్, ఆర్ టీ సీ బస్సులు, పెట్రోల్ బంక్, ఫెర్టిలైజర్ దుకాణాలు ఇతర స్వయం ఉపాధి యూనిట్లు ఏర్పాటు చేయిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ వేముల స్వరూపారెడ్డి, నేరళ్ళ నరసింగం గౌడ్, సిరిసిల్ల ఆర్డీవో వెంకటేశ్వర్లు, డి డబ్ల్యు ఓ లక్ష్మీరాజ్యం తహసిల్దార్ జయంత్ , సంబంధిత అధికారులు కాంగ్రెస్ మండల అధ్యక్షులు జలగం ప్రవీణ్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రహీంఖాన్ పేట మోడల్ స్కూల్‌లో సైబర్ నేరాలపై అవగాహన

**బలగం టీవీ, ఇల్లంతకుంట**

ఇల్లంతకుంట మండలం రహీంఖాన్ పేట్ గ్రామంలోని టి జి ఎం ఎస్ రహింఖాన్ పేట్ స్కూల్ లో స్థానిక యస్ ఐ సిరిసిల్ల అశోక్ ఆధ్వర్యంలో సైబర్ నేరాల పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా యస్ ఐ మాట్లాడుతూ దొంగతనాల గుర్తింపు, యు పిఐ లావాదేవీల మోసాలు, క్రెడిట్ కార్డు డెబిట్ కార్డు ద్వారా జరిగే మోసాలు తదితరాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గంగాధర్, ఎ ఎస్ ఐ బాలరెడ్డి, పి సి మోహన్,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




# పాడి పశువులతో పేద కుటుంబాలు ఆర్థికంగా ఎదగాలి



### జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**బలగం టివి, తంగళ్లపల్లి**

తంగళ్ళపల్లి ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో నిర్వహించిన పశువుల పంపిణీ కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జి కేకే మహేందర్ రెడ్డి లు రైతులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝు మాట్లాడుతూ ప్రస్తుతం పంపిణీ చేసే పశువులకు డెలీవరి తర్వాత 12 నుంచి 15 లీటర్ల పాలు అందిస్తాయని, ఎస్సీ లబ్ధిదారులకు నేడు 2 పశువులను సబ్సిడీపై అందిస్తున్నామని, వీటిని వినియోగించు కుంటూ ఆర్థికంగా ప్రజలు ఎదగాలని, 2 పశువులను క్రమం పద్ధతిలో 10 పశువుల స్థాయికి పెంచుకోవాలని కలెక్టర్ సూచించారు.పశువులకు సంబంధించి డైట్ చార్ట్ తెలుగు లో తయారు చేసి లబ్ధిదారులకు అందించాలని కలెక్టర్ జిల్లా వెటర్నరీ అధికారిని ఆదేశించారు. నేడు 14 మంది లబ్ధిదారులకు ఇక్కరికి 2 చొప్పున 28 పశువులు పంపిణీ చేస్తున్నామని భవిష్యత్తులో ప్రతి మండల స్థాయిలో ఇటు వంటి కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. హర్యానా నుంచి వచ్చిన బర్లు స్థానికంగా అలవాటు పడడానికి వారం రోజులు సమయం పడుతుందని అన్నారు.సబ్సిడీతో పంపిణీ చేసిన బర్ల ను బయట అమ్మడానికి వీలు లేదని కలెక్టర్ తెలిపారు. ప్రతి పశువుకు భీమ సౌకర్యం కూడా కల్పించామని అన్నారు. పశువుల ద్వారా ప్రతిరోజు 2000 రూపాయల ఆదాయం లభిస్తుందని అన్నారు. హర్యానా పశువులను తీసుకుని రావడంతో కృషి చేసిన వెటర్నరీ అధికారులకు కలెక్టర్ అభినందనలు తెలిపారు.

అనంతరం కేకే మహేందర్ రెడ్డి మాట్లాడుతూ వర్షా కాలంలో పచ్చి గడ్డి బాగా దొరుకుతుందని వీటిని వినియోగించుకుని పశువులకు మంచి ఆహారం అందించాలని అన్నారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా నిధులు మంజూరు చేసిన పేద కుటుంబాలకు పశువులు పంపిణీ చేస్తున్నామని అన్నారు.గత ప్రభుత్వ హయాంలో పేదలకు స్కీం ల పేరుతో స్కాం లకు పాల్పడ్డారని తెలిపారు. ప్రభుత్వ పథకం ద్వారా అందించే బర్రెలకు ఆరోగ్యపరంగా, బీమా, వైద్య సదుపాయాలు అందించేందుకు ప్రభుత్వం అండగా ఉంటుందని అన్నారు.ప్రభుత్వ డైరీలకు లబ్ధిదారులు పాలు పోయాలని సూచించారు.

సిరిసిల్ల మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ స్వరూప రెడ్డి మాట్లాడుతూ పేద కుటుంబాలు ఆర్థికంగా వృద్ధి చెందాలని లక్ష్యంతో పశువులు పంపిణీ చేస్తున్నామని అన్నారు. పశువులను జాగ్రత్తగా చూసుకోవాలని, లేగ దూడలకు పాలు కొంత వదిలి మిగిలినవి పిండుకోవాలని , లేగ దూడల పోషక లోపాలు రాకుండా చూసుకుంటే మంచి జరుగుతుందని అన్నారు. పశువులకు అందించే గడ్డి ఆహారంలో ఎటువంటి కెమికల్ వాడవద్దని, సిరిసిల్ల లో పాలు అమ్ముకోవాడానికి అవసరమైన సహాయం తీసుకుంటామని అన్నారు.ఈ కార్యక్రమంలో సిరిసిల్ల ఆర్డీఓ వెంకటేశ్వర్లు, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి, ఈడీ ఎస్సీ కార్పొరేషన్ స్వప్న, లబ్ధిదారులు, సంబంధిత అధికారులు సిరిసిల్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నేరళ్ల నర్సింగం గౌడ్,కాంగ్రెస్ మండల అధ్యక్షులు జలగం ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



## రైతులతో శాస్త్రవేత్తల చర్చ గోష్టి

**బలగం టీవీ, బోయినిపల్లి**

తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం, కరీంనగర్ వారి ఆధ్వర్యంలో బుధవారం రోజున రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల రైతు వేదిక లో కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతు విజ్ఞాన కేంద్రం, కరీంనగర్ శాస్త్రవేత్త డా. కె. మదన్ మోహన్ రెడ్డి ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశాన్ని వివరిస్తూ, ప్రస్తుత రైతులు పంట మార్పిడిలో భాగంగా చెఱకు పంటను సాగు చేసుకుంటే లాభమని వివరించారు. తదుపరి ప్రాంతీయ చెఱకు మరియు వరి పరిశోధన స్థానం నుండి విచ్చేసిన శాత్రవేత్తలు డా. రాకేష్ చెఱకులో ఉన్న మేలైన రకాలు మరియు వాటి గుణ గణాలను వివరిస్తూ, చెఱకు మొలక మరియు మోడెం తోటల్లో ఆచరించాల్సిన పద్ధతులు మరియు విత్తనోత్పత్తిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. తరువాత డా. కృష్ణ చైతన్య చెఱకు పంటలకు అనువైన నేలలు, ఎరువుల యాజమాన్యం గురించి వివరించారు. తదుపరి డా.సాయి చరణ్ చెఱకు పంటలలో వచ్చు పురుగులు గురించి వివరించారు. డా.ఎం.రాజేంద్రప్రసాద్ ఎర్ర కుళ్ళు, కాటుక తెగులు మరియు వడలు తెగులు గురించి వివరించారు. అలాగే తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం, కరీంనగర్ కోఆర్డినేటర్ డా. బి. హరికృష్ణ మాట్లాడుతూ: రైతులు చెఱకు పంటకు మొగ్గు చూపడం అనేది హర్షించ దగ్గ విషయమని తెలిపారు. ఇక ముందు కూడా రైతు సోదరులు శాస్త్రవేత్తల సలహాలు తీసుకొని పంట మార్పిడిలో భాగంగా చెఱకు సాగు చేస్తూ అధిక దిగుబడులు పొందాలని సూచించారు. తదుపరి సమత పరమేశ్వరి చెరుకులో కలుపు నివారణ మరియు నీటి యాజమాన్యం గురించి వివరించారు. వ్యవసాయ పరిశోధన స్థానం డాక్టర్ రాంప్రసాద్ వివిధ పంటల్లో మేలైన యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం జగిత్యాల, సహ పరిశోధన సంచాలకులు డా.హరీష్ కుమార్ శర్మ చెరుకు పంటలో తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులను మరియు పంట మార్పిడి గురించి వివరించారు. ఆ తరువాత రైతుల పొలాలను శాస్త్రవేత్తలు సందర్శించి తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఏరువాక కేంద్రం, కోఆర్డినేటర్ డా. బి. హరికృష్ణ, డాక్టర్ కే. మదన్ మోహన్ రెడ్డి, శాస్త్రవేత్త, డా. యం. రాజేంద్ర ప్రసాద్ శాస్త్రవేత్త, వ్యవసాయ పరిశోధన స్థానం, కరీంనగర్, డాక్టర్ రాంప్రసాద్ మరియు ప్రాంతీయ చెఱకు మరియు వరి పరిశోధన స్థానం, రుద్రూరు శాస్త్రవేత్తలు డాక్టర్ సమతా పరమేశ్వరి, డా. కృష్ణ చైతన్య, డా. రాకేష్ మరియు డా. సాయి చరణ్ , వ్యవసాయ పరిశోధన సహ సంచాలకులు డాక్టర్ హరీష్ కుమార్ శర్మ, మండల వ్యవస్థాధికారిని ప్రణీత, వ్యవసాయ విస్తరణ అధికారిని శ్రీదేవి, మాజీ జెడ్పిటిసి పులి లక్ష్మీపతి మరియు చెఱకు సాగు చేసే రైతులు మరియు ఇతర రైతులు పాల్గొన్నారు.



## మహిళ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యాక్షురాలిగా మాజీ ఎంపీటీసీ తీగల పుష్పలత

**బలగం టీవీ, ఇల్లంతకుంట**

ఇల్లంతకుంట మండలం అనంతారం గ్రామానికి చెందిన మాజీ ఎంపిటిసి సభ్యురాలు లితీగల పుష్పలత జిల్లా మహిళ కాంగ్రెస్ ఉపాధ్యాక్షురాలిగా నియమిస్తూ జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత నియమాక ఉత్తర్వులను అందజేశారు. రాష్ట్ర మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు సునితరావు ఆదేశాల మేరకు, మానకొండూర్ శాసన సభ్యులు, ఆరోగ్య ప్రధాత డాక్టర్ కవ్వంపెల్లి సత్యనారాయణ సూచన మేరకు, ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్ నేతృత్వంలో ,జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత ఉత్తర్వులను అందజేశారు. తన నియమాకానికి సహకరించిన కాంగ్రెస్ పార్టీ పెద్దలకు, నాయకులకు, ప్రజాప్రతినిధులకు, మాజీ ప్రజాప్రతినిధులకు, పేరు పేరున తీగలపుష్ప లత కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ సత్యారెడ్డి, ముత్యం భాగ్యలక్ష్మీ, గడ్డమీదీనాగలక్ష్మీ, అనంతారం గ్రామ శాఖ అధ్యక్షుడు బొల్లం శ్రీనివాస్ , వొల్లాల వెంకటేశం, బడుగు లింగం, చిట్టి రాంరెడ్డి,చొప్పరి అశోక్, ఆది మల్లయ్య, గడ్డమీది సాయితిలక్, మండల మహిళ కమిటీ సభ్యులు, గ్రామ మహిళలు పాల్గొన్నారు.



## ఘనంగా జయశంకర్ జయంతి వేడుకలు

**బలగం టివి, బోయినిపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతిని పురస్కరించుకొని మండల పరిషత్ అభివృద్ధి అధికారిని జయశీల జయశంకర్ చిత్ర పటానికి పూలమాల వేసి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ ఎల్లేష్ యాదవ్,కాంగ్రెస్ పార్టీ మండల అద్యక్షులు వన్నెల రమణారెడ్డి, ఏఎంసి వైస్ చైర్మన్ నిమ్మ వినోద్ రెడ్డి, ఏ.ఇ (పి ఆర్) సాయి తేజ రెడ్డి, కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# చెన్నై మాస్టర్స్ చెస్ టోర్నీ పోటీలు వాయిదా

**బలగం టీవీ, హైదరాబాద్**




ప్రతిష్టాత్మక చెన్నై మాస్టర్స్ చెస్ టోర్నమెంట్ మూడో ఎడిషన్‌కు ప్రారంభదినమే అపశృతి ఎదురైంది. బుధవారం నుంచి ప్రారంభం కావాల్సిన ఈ టోర్నీకి వేదిక అయిన హ్యాట్ రెజెన్సీ హెూటల్‌లో మంగళవారం రాత్రి అగ్నిప్రమాదం సంభవించడంతో పోటీలు వాయిదా పడాయి. ఈ విషయాన్ని టోర్నీ డైరెక్టర్, గ్రాండ్‌మాస్టర్ శ్రీనాథ్ నారాయణన్ వెల్లడిస్తూ "హెూటల్‌లో అగ్నిప్రమాదం కారణంగా అన్ని జాగ్రత్తలతో ఆటగాళ్లను సమీపంలోని మరో హెూటల్‌కు తరలించాం. పోటీలను ఒక రోజు వాయిదా వేసినట్లు తెలియజేస్తున్నాం" అన్నారు. వాయిదా నేపథ్యంలో టోర్నీ గురువారం నుంచి ప్రారంభమై ఈ నెల 15వ తేదీన ముగియనుంది. తొమ్మిది రౌండ్లుగా జరిగే ఈ టోర్నీలో పది మంది మేటి అంతర్జాతీయ గ్రాండ్‌మాస్టర్లు బరిలో దిగనున్నారు. మాస్టర్స్ విభాగంలో తెలంగాణకు చెందిన యువ గ్రాండ్‌మాస్టర్ అర్జున్ ఇరిగేసితో పాటు, విదిత్ గుజ్రాతి, కార్తికేయన్, నిహాల్ సరిన్ లాంటి భారతీయులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారు. ఈ టోర్నీకి చెన్నై ఇప్పటికే రెండు సార్లు విజయవంతంగా ఆతిథ్యం ఇచ్చిన నేపథ్యంలో, ఈసారి కూడా గొప్ప విజయాన్ని నమోదు చేయాలన్న ఉత్సాహం నిర్వాహకుల్లో కనిపిస్తోంది.

# ఆసియా అండర్-19, 22 బాక్సింగ్ చాంపియన్‌షిప్స్

## భారత్‌కు పతకాల పంట.. ఫైనల్‌కు నాలుగుపేర్లు

**బలగం టీవీ, హైదరాబాద్**

ఆసియా అండర్-19, అండర్-22 బాక్సింగ్ చాంపియన్‌షిప్స్‌లో భారత యువ బాక్సర్లు ప్రతిభ కనబరిచి పతకాల పంట పండించే దిశగా ముందుకెళ్తున్నారు. బుధవారం జరిగిన అండర్-22 విభాగంలోని పలు కేటగిరీల సెమీఫైనల్స్‌లో భారత బాక్సర్లు ప్రభంజనం సృష్టించారు. పురుషుల విభాగంలో 90 కిలోల కేటగిరీలో ఇషాన్ కటారియా, 75 కిలోలలో నీరజ్ ఫైనల్‌కు చేరారు. నీరజ్ దక్షిణ కొరియా బాక్సర్ కియోంగో బంగ్‌పై 5-0 తేడాతో విజయం సాధించగా, ఇషాన్ చైనాకు చెందిన చెన్ చెన్‌ను ఓడించాడు.

మహిళల విభాగంలో 57 కిలోలలో యత్రి పటేల్, 60 కిలోలలో ప్రియ ఫైనల్స్‌కు అర్హత సాధించారు. యత్రి, వియత్నాం బాక్సర్ తి నుంగ్‌పై 5-0తో విజయం సాధించగా, ప్రియ ఉజ్బెకిస్థాన్‌కు చెందిన ఇస్మోయిలోవను చిత్తుచేసింది. ఈ విజయాలతో నాలుగు ఫైనల్స్‌కు భారత బాక్సర్లు ప్రవేశించారు. వీరిలో కనీసం రజత పతకం ఖాయం కాగా, స్వర్ణం దిశగా ఆశలు రెప్పలు మెరుస్తున్నాయి. ఇక హర్ష్ (60 కిలోల), మయూర్ (90 కిలోల) సెమీఫైనల్లో ఓడినా.. కాంస్య పతకాలతో సంతృప్తి చెందారు.

# నటి శ్వేతా మీనన్‌పై కేసు

**బలగం టీవీ, హైదరాబాద్**



మిస్ ఇండియా 1994 టైటిల్ విజేత, 'రతినిర్వేదం' ఫేమ్ నటి శ్వేతా మీనన్‌పై అశ్లీలత ఆరోపణలతో పోలీసులు కేసు నమోదు చేశారు. 51 ఏళ్ల ఈ నటి కొన్ని సినిమాల్లో అసభ్య దృశ్యాల ద్వారా డబ్బు సంపాదించారంటూ, ప్రజా కార్యకర్త మార్టిన్ మేనచేరి చేసిన ఫిర్యాదుతో కొచ్చి సెంట్రల్ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. శ్వేతా మీనన్ నటించిన రతినిర్వేదం, పలేరి మాణిక్యం, కలిమన్ను వంటి మలయాళ చిత్రాల్లో అశ్లీల అంశాలు ఉన్నాయని మార్టిన్ మేనచేరి ఆరోపించారు. ఈ చిత్రాలు సెన్సార్ బోర్డు అనుమతితో విడుదలైనా, వాటిలోని అసభ్య దృశ్యాలు ఇప్పటికీ సోషల్ మీడియా, పోర్న్ సైట్లలో ప్రసారమవుతున్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రారంభంలో పోలీసులు ఈ ఫిర్యాదుపై స్పందించకపోవడంతో, మార్టిన్ మేనచేరి ఎర్నాకుళం చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాల మేరకు శ్వేతా మీనన్‌పై పోలీసులు కేసు నమోదు చేయాల్సి వచ్చింది. ఇక ఈ కేసుపై నటి శ్వేతా మీనన్ నుంచి ఇంకా ఎలాంటి అధికారిక స్పందన వెలువడలేదు. సినీ పరిశ్రమలో, కళాపరంగా తెరకెక్కించిన దృశ్యాలు ఇలాంటి ఆరోపణలకు దారితీయడం చర్చనీయాంశమవుతోంది.

# బ్యాడ్‌గాళ్స్.. కానీ చాలా మంచోళ్లు

**బలగం టీవీ, హైదరాబాద్**




అంచల్ గౌడ, పాయల్ చెంగప్ప, రోషిణి, యష్ణ ముఖ్య పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'బ్యాడ్‌గాళ్స్' ఉపశీర్షికగా 'కానీ చాలా మంచోళ్లు' పెట్టారు. మున్నా ధూలిపూడి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో రోహన్ సూర్య, మొయిన్ కూడా కీలక పాత్రల్లో కనిపించనున్నారు. బుధవారం ఈ సినిమా టైటిల్‌తో పాటు మోషన్ పోస్టర్‌ను ప్రముఖ దర్శకులు చందూ మొండేటి, కృష్ణచైతన్య కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు మున్నా ధూలిపూడి మాట్లాడుతూ "ఎంతో మంది అమ్మాయిల నిజ జీవితాల్లోని సంఘటనల నుంచి స్ఫూర్తి పొంది ఈ కథను రూపొందించాను. అమ్మాయిలు ధైర్యంగా ఎదగాలన్నదే ఈ చిత్ర లక్ష్యం. తల్లిదండ్రులు తమ కూతుళ్లను భయపడే మనస్తత్వంతో కాకుండా ధైర్యంగా ఎదిగేలా పెంచాలి అనే సందేశం ఇందులో ఉంటుంది," అని అన్నారు.పాఠశాల విద్యార్థినులకు స్వీయ రక్షణపై అవగాహన కల్పించేలా చిత్ర కథనం సాగుతుందన్నారు. ప్రతి కుటుంబం చూసేలా ఓ బాధ్యతతో ఈ సినిమా రూపొందించామని నిర్మాతలు పేర్కొన్నారు.

# కెరియర్‌లోనే అత్యుత్తమ ర్యాంక్‌కు సిరాజ్

- నెంబర్ 1లోనే బూమ్రా
- టాప్ 5లోకి జైస్వాల్
- బ్యాటింగ్‌లో రూట్ టాప్

**బలగం టీవీ, హైదరాబాద్**




ఇంగ్లండ్‌తో జరిగిన ఐదు టెస్టుల సిరీస్‌లో అద్భుతంగా రాణించిన టీమిండియా పేసర్ మహ్మద్ సిరాజ్ తన కెరీర్‌లోనే అత్యుత్తమ ఐసీసీ టెస్ట్ ర్యాంక్‌ను సాధించాడు. ఓవల్ వేదికగా జరిగిన సిరీస్ ఫైనల్ టెస్ట్‌లో కీలకమైన మూడు వికెట్లు పడగొట్టి భారత్ విజయాన్ని సొంతం చేసుకునేలా చేశాడు. దాంతో భారత్ 6 పరుగుల తేడాతో విజయం సాధించి సిరీస్‌ను 2-2తో సమం చేసింది. ఈ ప్రదర్శనకు ప్రతిఫలంగా సిరాజ్ 12 ర్యాంకులు మెరుగుపడి 15వ స్థానానికి చేరాడు. ఇది అతని టెస్ట్ కెరీర్‌లో ఇప్పటిదాకా అత్యుత్తమ ర్యాంకు కావడం గమనార్హం. గతంలో ఈ ఏడాది జనవరిలో అతను 16వ స్థాయికి చేరిన సంగతి తెలిసిందే. మరోవైపు, సిరీస్‌లో మూడు టెస్టులు మాత్రమే ఆడిన జస్ప్రీత్ బుమ్రా 889 రేటింగ్ పాయింట్లతో బౌలర్ల ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు.

ఐసీసీ తాజా బ్యాటింగ్ ర్యాంకింగ్స్ లో యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ టాప్-5లో స్థానం దక్కించుకున్నాడు. ఓవల్ టెస్ట్‌లో సెంచరీ బాదిన అతను మూడు స్థానాలు మెరుగుపడి టాప్-5లో స్థానం దక్కించుకున్నాడు. ప్రస్తుతానికి 5వ స్థానంలో ఉన్నాడు. మరోవైపు వికెట్ కీపర్ బ్యాట్స్‌మన్ రిషబ్ పంత్ ఒక స్థానం పడిపోయి 8వ స్థానానికి చేరుకున్నాడు. గాయం కారణంగా అతను ఓవల్ మ్యాచ్‌కు దూరమైన విషయం తెలిసిందే.

ఇంగ్లండ్‌కు చెందిన బ్యాట్స్‌మన్ జో రూట్ అద్భుతమైన బ్యాటింగ్‌తో టెస్ట్ బ్యాట్స్‌మన్ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. సెంచరీ హీరో హ్యారీ బ్రూక్ రెండో స్థానానికి చేరాడు. అలాగే బౌలర్ల విభాగంలో ఇంగ్లాండ్ పేసర్లు గస్ అట్కిన్సన్, జోష్ టంగ్ కెరీర్‌లో అత్యుత్తమ ర్యాంకులను సాధించారు. అట్కిన్సన్ తొలిసారి టాప్-10లోకి ప్రవేశించగా, టంగ్ 14 స్థానాలు మెరుగుపడి 46వ స్థాయికి చేరుకున్నాడు.

# 'ఘాటి' ట్రైలర్ విడుదల..





## సెప్టెంబరు 5న పాన్ ఇండియా రిలీజ్

**బలగం టీవీ, హైదరాబాద్**

టాలెంటెడ్ హీరోయిన్ అనుష్క శెట్టి కొత్తగా 'ఘాటి' అనే చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఇప్పటికే ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు. మాదకద్రవ్యాల మాఫియాను ఆధారంగా చేసుకుని తెరకెక్కుతున్న ఈ చిత్రం యాక్షన్, థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో నిండి ఉంది. ప్రముఖ దర్శకుడు క్రిష్ జాగర్లమూడి డైరెక్షన్ వహించిన ఈ చిత్రంలో తమిళ నటుడు విక్రమ్ ప్రభు కీలక పాత్ర పోషిస్తున్నారు. ట్రైలర్‌లో చూపించిన విజువల్స్, యాక్షన్ సన్నివేశాలు ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. సంగీత దర్శకుడు సాగర్ నాగవల్లి అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, మ్యూజిక్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సినిమాను యువి క్రియేషన్స్ బ్యానర్‌పై రాజీవ్ రెడ్డి, సాయిబాబు జాగర్లమూడి నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఈ చిత్రం విడుదల వాయిదా పడుతూ వస్తున్న నేపథ్యంలో, తాజాగా ట్రైలర్‌లో సెప్టెంబరు 5న విడుదల తేదీని అధికారికంగా ప్రకటించారు. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది.

# 'డేవిడ్ రెడ్డి'గా మంచు మనోజ్

**బలగం టీవీ, హైదరాబాద్**




విలక్షణ నటనతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న మంచు మనోజ్ సుదీర్ఘ విరామం తర్వాత వెండితెరపై చారిత్రక పాత్రలో దర్శనమివ్వబోతున్నారు. సినీ రంగ ప్రవేశానికి 21 ఏళ్లు పూర్తైన సందర్భంగా ఆయన తన 21వ సినిమా 'డేవిడ్ రెడ్డి'లిలిను అధికారికంగా ప్రకటించారు. ఈ సినిమాకు సంబంధించిన ఫస్ట్‌లుక్‌ను కూడా విడుదల చేశారు. పోరాట ఆత్మను ప్రతిబింబించేలా ఉన్న పోస్టర్ ప్రేక్షకుల్లో అమితాసక్తిని రేపుతోంది. 1897 నుంచి 1922 మధ్యకాలం బ్రిటిష్ సామ్రాజ్యానికి వ్యతిరేకంగా సాగిన ప్రజల యుద్ధ నేపథ్యంలో ఈ చిత్రం రూపొందనుంది. కుల వ్యవస్థను ఎదిరించి, సామాన్యుడు నుంచి యోధుడిగా మారి బ్రిటిష్ పాలనను కదిలించిన ఓ యువకుడి గాథను ఈ కథ చెబుతుందని చిత్రబృందం వెల్లడించింది.

"మద్రాస్ ప్రెసిడెన్సీలో పుట్టి, ఢిల్లీలో పెరిగి, ఇప్పుడు బ్రిటిష్ సామ్రాజ్యాన్ని కదిలిస్తున్నాడు" అనే ట్యాగ్‌లైన్ సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతోంది. ఈ చిత్రానికి హనుమ రెడ్డి యక్కంటి దర్శకత్వం వహిస్తున్నారు. మోటూకూరి భరత్, నల్లగంగుల వెంకట్ రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ప్రీ-ప్రొడక్షన్ పనులు జోరుగా సాగుతున్నాయి. స్క్రిప్ట్‌కు తుది మెరుగులు దిద్దుతున్నట్లు దర్శకనిర్మాతలు తెలిపారు. ఈ సందర్భంగా సోషల్ మీడియాలో స్పందించిన మనోజ్ మాట్లాడుతూ.. "నా సినీ ప్రయాణానికి 21 ఏళ్లు పూర్తయ్యాయి. నేను ప్రేమించే రంగంలో కొనసాగుతున్నందుకు కృతజ్ఞతతో ఉన్నాను. అదే ప్రేమతో నా 21వ సినిమాగా 'డేవిడ్ రెడ్డి' ప్రకటిస్తున్నాను. ఇది ఒక ఉద్వేగభరిత చారిత్రక యాక్షన్ డ్రామా. ఈ ప్రయాణం కోసం ఎంతో ఉత్సాహంగా ఉన్నాను" అని పేర్కొన్నారు.

# ఈడీ విచారణకు హాజరైన విజయ్ దేవరకొండ

**బలగం టీవీ, హైదరాబాద్**



ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ల ప్రమోషన్ కేసులో ఈడీ దర్యాప్తు ముమ్మరంగా కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో ప్రముఖ నటుడు విజయ్ దేవరకొండ నేడు ఈడీ విచారణకు హాజరయ్యారు. బెట్టింగ్ యాప్‌ల ప్రచారానికి సంబంధించిన మనీలాండరింగ్ ఆరోపణలపై వివరణ కోరుతూ ఈడీ అధికారులు ఆయనకు నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే.తెలంగాణ ప్రభుత్వం నిషేధించిన ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేసినందుకు పలువురు సినీ ప్రముఖులపై ఆరోపణలు రావడంతో ఈడీ దర్యాప్తును వేగవంతం చేసింది. ఇప్పటికే నటుడు ప్రకాశ్ రాజ్ గత నెల 30న హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని ఈడీ కార్యాలయంలో విచారణకు హాజరయ్యారు. తాజాగా విజయ్ దేవరకొండ కూడా ఈడీ ముందు హాజరై ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు.

అనంతరం విజయ్ మీడియాతో మాట్లాడుతూ.. తాను గేమింగ్ యాప్‌నే ప్రమోట్ చేశానని, గేమింగ్ యాప్స్‌కు, బెట్టింగ్ యాప్స్‌కు చాలా తేడా ఉంటుందని అన్నారు. తాను ఎ23 అనే గేమింగ్ యాప్‌ని ప్రమోట్ చేసినట్లు ఈడి అధికారులకు క్లారిటీ ఇచ్చానని తెలిపారు. "బెట్టింగ్ యాప్స్‌కి, గేమింగ్ యాప్స్‌కి సంబంధం లేదు. గేమింగ్ యాప్స్ చాలా రాష్ట్రాల్లో లీగల్. గేమింగ్ యాప్స్‌కి జిఎస్టి, టాక్స్, అనుమతులు, రిజిస్ట్రేషన్ ఉంటాయి. నా బ్యాంకు లావాదేవీల వివరాలను ఇడికి ఇచ్చాను. నేను ప్రమోట్ చేసిన ఎ23 యాప్ తెలంగాణలో ఓపెన్ కాదు. నేను లీగల్ గేమింగ్ యాప్‌ను మాత్రమే ప్రమోట్ చేశా. సంబంధిత కంపెనీతో నేను చేసుకున్న ఒప్పందం వివరాలూ ఇడికి ఇచ్చాను" అని విజయ్ పేర్కొన్నారు.